# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

కొండాపూర్, జూన్ 2 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం చందానగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పారునంది శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాను కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రాకు తాకట్టుపెడుతున్నారన్నారు. నీళ్లను ఆంధ్రాకు తరలించుకుపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్న, అడ్డుకునేందుకు వెనకడుగు వేస్తున్నారన్నారు. మరోసారి కొట్లాడేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధమవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ సలీం, దొంతి చిన్న, ఎండీ అప్సర, ఎం.ఉపేందర్, డి గిరి, రవితేజ, ముజయ్యద్, చంద్రశేఖర్, ఉదయ్, కాశీనాథ్ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వెస్ట్‌జోన్ జీహెచ్ఎంసీ, శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించారు. జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడే జాతీయ జెండాను ఆవిష్కరించారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్, జూన్ 2 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా కొంపల్లి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చంద్రమోహన్ రెడ్డి , కమిషనర్ కృష్ణారెడ్డి సోమవారం డా. బీఆర్‌అంబేద్కర్, ప్రొ. జయశంకర్ చిత్ర పటాలకు పూలమాల వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ సిబ్బంది, కొంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్ , మాజీ సర్పంచ్ జమ్మి దేవేందర్, ఉప సర్పంచ్ అన్నారం గోపాల్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి లేబర్ సెల్ అధ్యక్షుడు కందడి సుదర్శన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆదిరెడ్డి, మోహన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, పూర్ణచందర్ రావు పాల్గొన్నారు.


ఆల్విన్ కాలనీలో బీఆర్ఎస్ నేత ఎర్రబల్లి సతీశ్ రావు, రామస్వామి, జీవన్ రెడ్డి


హైదర్ నగర్ లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు


వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారావు కార్పొరేటర్లు సత్యనారాయణ, సతీశ్ గౌడ్, రవీందర్ రెడ్డి


వేడుకల్లో జడ్సీ అపూర్వ చౌహాన్, ఎస్ఈ చిన్నారెడ్డి, డిసీలు వంశీకృష్ణ గంగాధర్


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం


కొండాపూర్ : చందానగర్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు శ్రీకాంత్


శేరిలింగంపల్లి : వెస్ట్ జోన్ కార్యాలయ ఆవరణలో వేడుకల్లో పాల్గొన్న జడ్సీ హేమంత్ బొడ్కరే, కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, నాగేందర్ యాదవ్


కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరణ చేస్తున్న అధికారులు


కేపీహెచ్‌బీ కాలనీలో జయశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, సురేశ్ రెడ్డి రాజేశ్‌రాయ్


బాలాజీ నగర్ డివిజన్‌లో.. కార్పొరేటర్ శిరీష, మాజీ కార్పొరేటర్ బాబురావు ప్రభాకర్ గౌడ్, వెంకటేశ్ చౌదరి



## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కొండాపూర్ : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారుల పేరిణి, భరతనాట్యం, ఒడిస్సీ, కథక్, సంబల్పూరి నృత్యాలు అలరించాయి. పేరిణి సంతోష్ శిష్య బృందం, భరతనాట్యం అస్మిత కాలే శిష్య బృందం, కథక్ అర్చన మిశ్ర శిష్య బృందం, సుస్మిత మిశ్ర శిష్య బృందం సంబల్పూరి జానపద నృత్యంతో అలరించారు.


దూలపల్లి పీఏసీఎస్ ఆఫీస్ ఎదుట అవతరణ దినోత్సవానికి హాజరైన కమిటీ సభ్యులు


బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో.. అడిషనల్ డీసీపీ సత్యనారాయణ


జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న సీఐ మల్లేశ్

## ప్రభుత్వ వైద్యశాల నిర్మాణ పనులపై స్పందించండి

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 2 : కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లోని 1.17 ఎకరాల్లో... 100 పడకల వైద్యశాలను నిర్మించేందుకు శంకుస్థాపన చేశామని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి గ్రామం సర్వేనం.1009లో వైద్యశాల నిర్మాణానికి 1.17 ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌ను రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ అధికారులు కోరినా.. ఇప్పటివరకు స్పందన లేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి స్థలాన్ని స్వాధీనం చేసుకొని వైద్యశాల నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు.

## ప్రభుత్వ బడుల్లో పిల్లలు చేరేలా కృషి చేయండి

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీ బ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు చొరవ తీసుకొని విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం సుల్తాన్ బజార్, ఉస్మాన్‌గంజ్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సుల్తాన్‌బజార్‌లో నూతనంగా నిర్మించిన పాఠశాలలో మెరుగైన సదుపాయాలు కల్పించామని, బస్తీల్లోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించి.. వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చొరవ తీసుకోవాలన్నారు. బాగా పనిచేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను గుర్తించి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనం పనులకు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు చేపట్టకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉస్మాన్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి.. రెండు విభాగాల్లోని పాత భవనాలను సత్వరమే తొలగించి నూతన భవనాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, ఏడీ శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షఫీమియా, డీఈ ఆశీర్వాదం, హెచ్ఎం మాధురి, విజయలక్ష్మి, శోభ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జేఎన్టీయూహెచ్ లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో వీసీ కిషన్ కుమార్ రెడ్డి, రెక్టార్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి నియోజకవర్గంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, మిఠాయిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ సార్ మార్గదర్శకంలో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒడిదుడుకులను ఎదుర్కొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా అభివృద్ధి చేశారని, దేశంలో రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా నిలిపిన ఘనత తొలి సీఎం కెసిఆర్‌దే అన్నారు. రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతల విషయంలో, నీటి ప్రాజెక్టులు మౌలిక సదుపాయాలు సంక్షేమ పథకాలు ఇలా అన్ని రంగాల్లో తనదైన ముద్ర వేసి ఆదర్శ పాలన అందించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీశ్ గౌడ్, సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలోని జయశంకర్ సార్ విగ్రహానికి కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కాలనీలో జాతీయ జెండాను ఎగురవేసి స్వీట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, సురేశ్ రెడ్డి, రాజేశ్ రాయ్ , సాయి శ్రీనివాస్ , పాతూరి గోపి పాల్గొన్నారు.బాలాజీ నగర్ కార్పొరేటర్ కార్యాలయం వద్ద కార్పొరేటర్ శిరీష బాబురావు జాతీయ జెండాను ఎగరవేశారు. డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, వెంకటేష్ చౌదరి, పవన్ కుమార్, హరినాథ్, ముత్యాపాక శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, జిల్లా గోపాల్, మల్లేశ్, సప్పిడి శ్రీనివాస్, ప్రకాశ్, అరుణ శెట్టి, లక్ష్మీరాజ్యం ఉన్నారు.

అల్లాపూర్ : అల్లాపూర్ డివిజన్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శ్రీ వివేకానంద నగర్ వార్డు కార్యాలయం ఆవరణలో కార్పొరేటర్ సబిహ బేగం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కల సహకారం చేసిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలయ్య, వీరారెడ్డి, పిల్లి తిరుపతి, బొల్లు శ్రీనివాస రావు, జ్ఞానేశ్వర్, జాహేద్ షరీఫ్ బాబా, రోణంకి జగన్నాథం, యాదవ రెడ్డి, కృష్ణా రావు, జితేందర్, శ్రీనివాస్ రెడ్డి, చాంద్ సాబ్, మల్లికార్జున్, మాధవ చారి, రాంబాబు, మల్లేశ్, విజయ్ గౌడ్, మధు, సంజీవరెడ్డి, పార్వతమ్మ, ముత్యాల దుర్గ, అమ్ములు, లక్ష్మి, రేవతి, వెంకటమ్మ, రుక్మిణి పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని రంగారెడ్డి నగర్ జగద్గిరిగుట్ట డివిజన్‌లో నిర్వహించారు. జగద్గిరిగుట్టలో కార్పొరేటర్ జగన్ జాతీయ జెండా ఎగరవేశారు. బీజేపీ నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లారెడ్డి, జె.కె. శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

మూసాపేట : తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యాలయం వద్ద, మూసాపేట చౌరస్తా, మోతి నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

కుత్బుల్లాపూర్ : తెలంగాణ అవతరణ దినోత్సవం పురస్కరించుకొని కుత్బుల్లాపూర్‌లో వేడుకలు అధికారికంగా నిర్వహించుకున్నారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నేతృత్వంలో కుత్బుల్లాపూర్ గాజుల రామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణలో హాజరయ్యారు. దూలపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ గరిసె నరేందర్ రాజు ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో కమిషనర్ కృష్ణారెడ్డి నేతృత్వంలో కార్యక్రమం జరుపుకున్నారు.

## ఇద్దరికి రిమాండ్

జీడిమెట్ల, జూన్ 2 : దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని జీడిమెట్ల, బాలానగర్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, బాలానగర్ ఏసీపీ నరేశ్ రెడ్డి, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సూరారం సాయిబాబానగర్‌కు చెందిన నక్క శ్రీనివాస్ రావు వివిధ పీఎస్‌ల పరిధిలో వాహనాలు దొంగిలించి షికార్లు చేస్తుంటాడు. శ్రీనివాస్ రావుపై ఇప్పటికే 6 కేసులు ఉండగా జైలుకు వెళ్లి వచ్చాడు. సోమవారం శ్రీనివాస్ రావు దొంగలించిన వర్నా కారులో తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

### మరో నిందితుడు..

బౌరంపేట గ్రామానికి చెందిన మహ్మద్ షోహెబ్ వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాలు దొంగిలించి అమ్ముకుంటుంటాడు. ఇదే తరహాలో దొంగతనం చేసి తప్పించుకుని తిరుగుతుండగా సోమవారం జీడిమెట్ల పోలీసులు షోహెబ్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన బాలానగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రాజు, జీడిమెట్ల డీఐ కనకయ్య, ఎస్సైలు పోచయ్య, గిరిశ్, శ్యాంబాబు, హెడ్ కానిస్టేబుల్ ఇలేజర్, కానిస్టేబుళ్లు అర్జున్, విశాల్, రాజ్ కుమార్‌ను ఏడీసీపీ సత్యనారాయణ అభినందించి మెరిట్ సర్టిఫికేట్లు అందజేశారు.

## డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

మాదాపూర్ : స్కూటీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మాదాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ కథనం ప్రకారం.. కేపీహెచ్‌బీకి చెందిన చింతలపూడి సాయిమాధవ్.. సోమవారం ఉదయం 6:30 గంటలకు స్కూటీపై గచ్చిబౌలి నుంచి కేపీహెచ్‌బీవైపు వెళ్తున్నాడు. సైబర్ టవర్ ఫ్లైఓవర్ శిల్పారామం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని కిందపడగా.. సాయిమాధవ్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొండాపూర్‌లోని గవర్నమెంట్ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు పోస్టుమార్టం నిమి త్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## నిందితుడి రిమాండ్

యువకుడిని హత్య చేసిన ఘటన రెండు రోజుల క్రితం మాదాపూర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు దర్యాప్తు చేసి నిందితుణ్ణి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ కథనం ప్రకారం.. మణికొండలో ఉంటున్న జయంత్ గౌడ్ (18) తల్లి పుట్టినరోజు సందర్భంగా స్నేహితులతో అర్ధరాత్రి 1:30 గంటలకు యశోద దవాఖాన వెనకాల మద్యం సేవిస్తూ ఉండగా ఈశ్వర్‌సింగ్ మూత్ర విసర్జనకు వచ్చి జయంత్ గౌడ్ వద్దకు తన స్నేహితులతో కలిసి మద్యం బాటిళ్లతో పాటు డబ్బులు ఇవ్వమని కత్తులతో బెదిరించారు. జయంత్ గౌడ్, ఈశ్వర్ సింగ్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈశ్వర్ సింగ్ తన స్నేహితులతో కలిసి జయంత్ గౌడ్‌పై కత్తులతో దాడిచేసి ఎడమ వైపు, పక్కటెముకలు, నడుముపై కత్తితో పొడవగా కొనఊపిరితో ఉండగా 100 డయల్ ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జయంత్ గౌడ్‌ను యశోద దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. నిందితుల కొరకు పోలీసులు గాలించగా ఈశ్వర్ సింగ్ హత్య చేసినట్లు గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## దొంగతనాలకు పాల్పడిన నిందితుడికి..

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సోమవారం మియాపూర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్‌కు చెందిన బొడిగి శ్రీకాంత్ కూలీ పనిచేస్తూ దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మార్తాండ నగర్‌లో నివాసం ఉంటున్న గజేంద్ర సింగ్ ఇంట్లో సెల్ ఫోన్ దొంగలించాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు.